# సరసమైన కథ

కథ హృదయానికి హత్తుకుంది.

అతని కథ ఆమె హృదయానికి హత్తుకుంది.

ఆమె పై బెర్త్‌లో ఉంది.

అతను ఎదురుగా కింది బెర్త్‌లో ఉన్నాడు.

ఆమె ఎద మీద పొర్లుతోంది వార పత్రిక. అందులో ఉంది అతని కథ. అతను రాసిన కథ. ఆమె ఆ పేజీలు తిప్పింది. కాని కథ చదవదు.

ఆ కథకి వేసిన బొమ్మ రసరమ్యంగా ఉంది.

ఆ కథ పేజీలు విడదీసి ఎదమీద పెట్టుకుని అలవోకగా పడుకుంది ఆమె.

చిన్న బెడ్‌లైట్ వెలుగు ఆమె బుగ్గల మీద సున్నితంగా మెరుస్తోంది.

ఆ లైటులో పుస్తకం చదవడం కొంచెం కష్టమే.

అయినా వారపత్రికలో చాలా భాగం చదివేసింది. ఆ కథ మాత్రం చదవలేదు.

ఎందుకు చదవలేదు? చదవదా?

రైలెక్కినప్పటి నుంచి గమనిస్తున్నాడు సుందరం. చేయి తిరిగిన రచయిత సుందరం. వందలాది కథలు రాశాడు. అభిమానులు కోకొల్లలు. కాని నిజ జీవితంలో థ్రిల్ మహా గొప్పది.

అది సరసమైన కథ. ఆ వారం సుపరివార పత్రికలో వచ్చింది.

అనుకోకుండా ఇదో రసవత్తర ఘట్టం. ఒక అందమైన అమ్మాయి ఆ కథని చదవడం.

ఆమె చదువుతుండగా తను పరికించడం.

అసలే సరసమైన కథ. ఆ పైన అందమైన అమ్మాయి. ఆపైన పై బెర్తు. ఎంత అద్భుతమైన దృశ్యం.

తన కథలో అక్షరాల వెంట ఆమె కళ్ళు పరుగెడుతూ ఉంటే హావభావాలు చూడాలి.

రసవంతమైన వర్ణనలు చదువుతుండగా ఆమె బుగ్గలు పొంగడం చూడాలి. ఆమె నవ్వడం నవ్వుకోవడం చూడాలి. సరసాల సంగతులు ఊహించుకుంటూ ఆమె సిగ్గుపడడం ఉత్కంఠగా చదవడం కళ్ళారా చూసుకోవాలి.

సుందరం మంచి వ్యక్తి. మంచి రచయిత. ఆశలున్నాయి. అత్యాశలు లేవు...

సినిమా కథలో చెప్పినట్టూ...సీన్ కట్ చేస్తే...

క్లోజప్ అయింది. వారపత్రిక జారిపడింది. అతను అందుకున్నాడు. తెలీనట్టు పైకి చూస్తూ "మీదా?" అన్నాడు.

"అవునండీ" అంది పై బెర్తు సుందరి. "ప్లీజ్..." అంటూ చెయ్యి సాచింది.

అతను పత్రికను అందిస్తుండగా అనుకోకుండా వేళ్ళూ వేళ్ళూ తాకాయి. సున్నితం. అతి సున్నితం.

ఆ తర్వాత కట్ చేస్తే...మీరెక్కడిదాకా అంటే మీరెక్కడి దాకా.

వీక్లీ చదివేశారాండీ అని అతనడిగితే కావలిస్తే మీరు చూడండీ అని ఆమె అంటుంది...

అలా కట్ చేసి, కట్ చేస్తే...అరె...నా కథ వేశారండీ అని సుందరం అంటే...మీరు కథలూ రాస్తారా? అనీ.... ఏ కథ మీదీ...అనీ...ఆ వారం సరసమైన కథ అతను రాసిందేనని తెలియగానే....

కట్ చేస్తే... టైట్ క్లోజప్...

ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి. పెదవులపై నవ్వు చిమ్ముకొచ్చింది. కళ్ళలో అభిమానం నక్షత్రాల్లా మెరిసింది.

కట్ చేస్తే... ఆమె వచ్చి కింది బెర్త్‌లో అతని పక్కనే కూచుంది. జోకులు, నవ్వులు, కబుర్లు...

రైలు చక్రాల రొద బదులు హాయిగా నేపథ్య సంగీతం వినిపిస్తోంది. అందమైన అనుభవం ఇదే ఇదే.

కట్ చేస్తే...

టప్‌మని శబ్దమైంది.

కిందికి చూశాడు. పత్రిక పడలేదు. పైకి చూశాడు. ఆమె అప్పుడే

బెడ్‌లైట్ స్విచ్ ఆఫ్ చేసింది. సర్దుకుని పడుకుంటోంది. వారపత్రిక ఆమె భుజం కిందే ఉంది.

చదవడం లేదు. ఇక నిద్రపోతుంది. సరసమైన కథ చదవలేదు. కొంపదీసి ఆమెకు ఇష్టం లేదా? అలా అనుకోవడానికి లేదు. ఆమె అలిసిపోయి ఉండొచ్చు. అందుకే ప్రస్తుతానికి చదవడం లేదు. లేక...ఇంతకు ముందే చదివేసిందా? అలా అనుకోవడానికి లేదు. తను చూస్తుండగా సరసమైన కథ పేజీలు తీసింది కదా! చదవడం మొదలు పెట్టినట్టే కదా?

కట్ చేసి కట్ చేసి కట్ చేసి...అలిసిపోయాడు సుందరం.

ఊహల్లో సీన్‌లు నడవడం లేదు. అందమైన అమ్మాయి అలా నిద్రపోయిందంటే...ఇక సీన్ ఎలా నడుస్తుంది?

సరే చూద్దామనుకుంటూ తనూ పడుకుండిపోయాడు సుందరం.

నేపథ్య సంగీతం లేదు. వట్టి రైలు చక్రాల రొదే! సరస భావనలు లేకుంటే జీవితం ఎంత నిస్సారమై పోతుంది!

పడుకున్నా నిద్ర పట్టదు. ఆగిపోయిన సీన్ మళ్ళీ మొదలవుతుందని ఆశ. చిన్న చిన్న ఆశ. చిన్నదది ఆశ.

అప్పుడప్పుడూ కళ్ళు తెరిచి చూస్తున్నాడు సుందరం.

అతని అంచనా పూర్తిగా తప్పుకాలేదు. ఆమె వెంటనే నిద్రపోలేదు. మధ్య మధ్యలో కదులుతూనే ఉంది. ఒకసారి సెల్‌ఫోన్‌లో టైము చూసుకుంది. ఇంకోసారి బెడ్‌లైట్ ఆన్ చేసింది. పర్సు కెలికి చూసుకుంది. అలా కదుల్తూ ఉండి పల్చటి దుప్పటి వొంటినిండా కప్పుకుంది.

పరదా కప్పిన శిల్పంలా ఉన్న ఆమె సౌందర్యాన్ని అలా ఊహించు కుంటూ నిశ్చలంగా చూస్తుండి పోయాడు సుందరం.

ఆమె ఉన్నట్టుండి కదిలి తలతిప్పి చూసింది. చీకటిలో సరిగ్గా తెలియలేదు.

తనవైపే చూసిందనుకున్నాడు సుందరం. తను దొరికిపోకూడదు. దొరికితే సరసం లేదు. కళ్ళు మూసుకున్నాడు.

నిద్రకాదు. మగత. అటూ ఇటూ కాని అవస్థ. తెలుస్తోంది తెలీడం లేదు. ఆమె కదుల్తోంది. పడుకుంటోంది. పత్రిక తీసింది. లైటు వేసింది. ఆర్పింది. పడుకుంది. అంతేనా?

అన్ని సీన్లూ అయిపోయాయా?

ఫేడ్ ఔట్!

నిద్రమత్తు వదిలించుకుని సుందరం రైలు దిగేసరికి ఆమె అతని కన్న ముందే రైలు దిగేసింది.

ఆమెను రిసీవ్ చేసుకోవడానికి ఎవరో ఫ్రెండ్ స్టేషన్‌కి వచ్చింది.

అనుకోకుండా వాళ్ళిద్దరి వెనకే గుంపును చీల్చుకుంటూ స్టేషన్ బైటకొచ్చేసరికి అప్పుడే నిద్ర వదిలినట్టయింది. సీన్లూ లేవు. కట్‌లూ లేవు అనుకుంటూ ఉండగానే.....

వాళ్ళిద్దరూ ఆటో ఎక్కడం కనిపించింది. యథాలాపంగా అన్నట్టు పక్కగా వెళ్తుండగా వాళ్ళ మాటలు వినిపించాయి.

ఫ్రెండ్ అంటోంది:

"నీ కేం పుస్తకాల పురుగువి...జర్నీ అంటే నీకు విసుగే లేదూ... హాయిగా పై బెర్త్‌లో చదువుకుంటూ ఎంజాయ్ చేసుంటావ్..."

"కానీ ఈ సారి నా టైము బావు లేదే" అంటోంది సుందరి.

"ఏమైందేంటీ?"

"ట్రెయినెక్కుతూ వీక్లీ కొన్నాను. హాయిగా చదువుకుందామంటే... కింద బెర్త్‌లో పోకిరీ శాల్తీ వొకడూ...చూడ్డానికి జెంటిల్మెన్‌లా ఉన్నాడేగాని...రాత్రంతా చూపుల్తో తినేస్తూనే ఉన్నాడూ...."

సుందరం గుండె దడాదడామంది.

"పోనీలేవే...నువ్వంత అందంగా ఉన్నావ్ మరీ..." అని ఫ్రెండ్ అంటుండగా వాళ్ళ ఆటోస్టార్ట్ అయింది.

గాలిలోంచి తేలివచ్చిన మాట మాత్రం పూలమంటలా సుందరం ముఖాన్ని కొట్టింది.

"ఆ సైంధవుడి పుణ్యమాని ఈ వారం సరసమైన కథ వెంటనే చదవలేకపోయానే...అదీ నా అభిమాన రచయిత...సుందరం రాసిన కథ....."

06.05.2011 సంచిక